


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -179-

(13 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"**ప్రపంచంలో ఎవరు** మోసగాళ్ళో, ఎవరు మంచివాళ్ళో తెలియని స్థితిలో వుంది నాయనా జగత్తు. అందరూ మంచివారని అవస్థలు పడటం కన్న – కాదనుకుని కాస్త జాగ్రత్తగా వుండటం మంచిది నాయనా!" అని ఒక ముసలమ్మగారు చెపుతోంది బస్సులో.

"అదేమిటండి మరీ అంత భయపడుతున్నారు లోకాన్ని చూసి?" అని ఒక ప్రయాణికుడు ప్రశ్నించాడు.

"ఇంకా నయం నేనొక్కదాన్నే భయపడటమేమిటి? ఎంతమందో భయపడుతున్నారు. ఎవర్ని నమ్మేది ఆ భగవంతుణ్ణి తప్ప మరెవ్వరినీ నమ్మడానికి శక్యంలేకుండావుంది కొందరు ఆయన్ని కూడా నమ్మడం లేదనుకోండీ అది వేరే విషయం.

"నమ్మిన నిన్నే నమ్మవలె నేనది యెట్లన" అని వుందిగా పద్యం అలాగే ఆయన్నే నమ్మాలి. చేస్తే మంచి చేస్తాడు. లేకపోతే వదిలేస్తాడు. కాని మోసం మాత్రం చెయ్యడు నాయనా!.. మోసం చేసిన వాళ్ళను ఒక కంటితో చూస్తాడంటారు.

"కాని ఇందరు మోసగాళ్ళను చూడటమంటే ఆయనకు మాత్రం సాధ్యమా? ఎంత అరవిద దళాక్షుడైనా, ఎంత విశాల నేత్రుడైనా, ఇంతమంది మోసగాళ్ళను చూసేటప్పటికి ఆ కళ్ళు చెదిరిపోవు పాపం"... అన్నది ముసలమ్మగారు.

"ఇంతకీ మీరు హైదరాబాద్ వెడుతున్నామన్నారు. ఎక్కడ దిగుతారు?" అని, జులపాల జూట్టు, బుష్ కోటు యువకుడు ప్రశ్నించాడు.

ఆమె క్షణం ఆగకుండా "ఆ! ఎక్కడ దిగుతానా? సాధ్యమైనంతవరకు మూసీలో లేదా హుస్సేన్ సాగర్లో. నీకెందుకయ్యా ఆ వివరాలన్నీ బస్సులో వున్నంతసేపే మన చుట్టరికం. దిగిన తర్వాత ఒకళ్ళ సంగతి ఒకళ్ళకెందుకు.

అలా అడక్కూడదు నాయనా అడక్కూడదు. అవన్నీ పూర్వపు రోజులు. ఎవళ్ళ దోవన వాళ్ళను పోనివ్వాలి. అయినా మా అబ్బాయిలు బస్సు దగ్గరికొస్తారు. పైగా నా దగ్గరేం లేదు. సంచిలో రెండు పాత బట్టలున్నాయి. టిక్కెట్టు కొనగా

అర్ధరూపాయి మిగిలింది. కావాలంటే నార్కెట్‌పల్లిలో టిఫిన్ తిను ఇస్తాను. బిడ్డలాంటివాడివి. చేత్తో ఇస్తే ఎంతైనా పుణ్యమే" అన్నదామె.

ఆ బుష్‌కోటూ యువకుడికి కోపం వచ్చింది. "మీ అర్ధరూపాయి నాకెందుకమ్మా. అంత గతిలేదనుకున్నావా?" అని అరిచాడు.

"కోప్పడకు నాయనా బిడ్డలాటి వాడివన్నాగా ఆ మాత్రం ఇవ్వకూడదేమిటీ! అర్ధరూపాయి వంక చూస్తున్నావుగానీ నువ్వు నా ఆప్యాయత మాట ఆలోచించడంలా" అన్నదామె ఎంతో ప్రేమగా. ఆ యువకుడు కోపం అంది పుచ్చుకున్నాడు ఆ మాటల్తో

"బామ్మగారూ, నిజంగా మీరన్నంత మోసంగా వున్నదంటారా ప్రపంచం. ఎక్కడో నూటికో, కోటికో ఒక మోసం జరగవచ్చు. దానికోసం ఎవర్నీ నమ్మవద్దంటే ఎలా చెప్పండి" అని పెద్ద మనిషి ప్రశ్నించాడు.

"ఇతరులను నమ్మవద్దనడం లేదు. మనస్సులో నమ్మండి. మాటల్లో దాన్ని బయటపెట్టకండి. నమ్మకాలు నాటక చివర్లలో కాపురం చేసే రోజులుగా కనిపించడం లేదంటున్నారు.  నా అభిప్రాయం చెప్పాను. మీరు నమ్ముతానంటే నేను వద్దంటానా" అన్నదామె.

బామ్మగారూ మీరు జాగ్రత్తగా వుండమనడం బాగానే వుంది. కాని ఒకరిని ఒకరు పలకరించడం, వారిని గురించిన యోగక్షేమాలు తెలుసుకోవడం మన ఆచారం. ఎక్కడో కొందరు మోసగాండ్రుంటారని మనం అలాటి సాంప్రదాయాన్నే పోగొట్టుకొంటామా? అని ఒక దేశభక్తుడి టైపు చూపులు గల పెద్ద మనిషి ప్రశ్నించాడు.

“నా అభిప్రాయం చెప్పాను నాయనా.. అంత కోపం వస్తే ఏం చేస్తాం? నా కళ్ళారా కొన్ని మోసాలు చూశాను. కొన్ని చెవులారా విన్నాను.కనుక నా ఆందోళన.” అన్నదామె.

“ఒక్కటి చెప్పండి బామ్మగారూ వింటాం. హైదరాబాద్ వస్తోంది. మీరు దిగి వెళ్ళిపోతారుగా. ఈలోగా ఒక్క మోసప్రకరణ చెప్పండి. కాలక్షేపంగానూ వుంటుంది. మీరు చెప్పే విషయం మీద లక్ష్యం కుదురుతుంది.” అన్నాడో ప్రయాణికుడు.

“చెప్పడానికేం, జరిగినవి చెపుతాను. నేనేం కల్పిస్తున్నానా. కవిత్వం వ్రాస్తున్నానా మాబంధువుల్లో ఒక అమ్మాయి సర్కారు జిల్లాలో ఉద్యోగం చేస్తూ నిరుడు వేసవికాలం సెలవలకు హైదరాబాద్ వచ్చింది. బస్సులో ఆ అమ్మాయీ, మరో ముసలావిడ మాత్రమే వున్నారట. అది రాత్రి బస్సు.

రాత్రి బస్సుల్లో ప్రయాణం చేస్తే చల్లగా వుంటుంది. మెల్లగా  ఊరు చేరవచ్చు అనుకుంటారు పాపం. బస్సు పొడవునా ఒక యువకుడు ఆ అమ్మాయిని చూసి, ఇకిలించడం, సకిలించడం, ఏదో గొణగడం, సణగడం సాగించాడుట.

సరే ఎలాగో అలా బస్సు హైదరాబాద్ చేరింది. ఆ అమ్మాయి బస్సు దగ్గరకు రమ్మని మాకు వ్రాసిన ఉత్తరం మాకు క్రిందటి రోజు అందలేదు. ఇవ్వో తమాషా పోస్టాఫీసులు. అర్జంటుని ఆలస్యంగా వచ్చినా, ఆలస్యంగా వచ్చినా ఫర్వాలేనివి అతి ముందుగా వస్తూ వుంటాయి.

ఆ అమ్మాయి బస్సు దిగి మా వాళ్ళ కోసం చూసిందట. బస్సులో వచ్చిన ఆ ఆపద్రక్షకుడు 'ఏమండీ మీ వాళ్ళు రాలేదా? అయ్యో పాపం పోనీ మా రూముకే వెడదాం రండి. ఈ పూట రెస్టు తీసుకుని సాయంత్రం మీ వాళ్ళ యింటికి వెళ్ళొచ్చు" అన్నాడట.

ఆ అమ్మాయి కొంచెం భయపడి వద్దులేండి మా వాళ్ళు వస్తారు. రాకపోతే ఫోన్ చేస్తాను అందట.

"అదేమిటండీ మా రూముకి రావడానికి అలా భయపడతారు. మీకు సిటీ ఫాషన్స్ తెలియవల్లే వుందే! మరేం ఫర్వాలేదు రండి" అన్నాడట.

ఆ అమ్మాయి కొంచెం కోపంగా "ఏమీ అక్కరలేదు. దయచేసి మీరు వెళ్ళండి" అని కొంచెం దబాయించింది. దానికి అతగాడు చలించలేదట. పోనీ నెంబరు చెప్పండి. నేను ఫోను చేస్తాను అన్నాడట. ఫోను చెయ్యడం నాకు తెలుసు వెళ్ళండి మీరు అందట. అన్నా వినిపించుకోకుండా ఫోను తనే చేస్తానని నెంబరు తీసుకున్నాడుట.

"ఫోనులో మా అమ్మాయి మాట్లాడింది. మా అబ్బాయి పరుగెత్తుకు వెళ్ళిదాన్ని ఇంటికి తీసుకువచ్చాడు. అక్కడితో ముగిసిందా పీడ. ఆ అమ్మాయి పేరు తెలుసుకున్నాడుగా సాయంత్రమే ఫోను. "కులాసాగా చేరారా ఇంటికి. ఈ పూట ఎక్కడికైనా షికారుకి బయలుదేరుతున్నారా చెపితే నేనుకూడా వస్తాను" అన్నాడట. నాలుగు తిట్టి ఫోను పెట్టేసింది.

మొండి ఘటాలకేం వుంది, మళ్ళీ రాత్రి ఫోను, తెల్లారి ఫోను. పోనీ ఫలానా హోటల్ దగ్గరికి రాకూడదూ కాసేపు కులాసాగా మాట్లాడుకుందాం"అని. అది విని మా వాడూ ఫోను తీసుకుని చడమడా తిట్టాడు.

"అయితే మాత్రమే వేసవికాలం వెళ్ళే వరకూ రోజూ ఫోను వస్తూనే వుండేది. తిడితే నవ్వుకునేవాడు. పోనీ ఒకసారి వాణ్ణి చూపించమ్మా. ఏ పోలీసులకో అప్పచెపుదాం" అన్నాడు మా వాడు.

"వాడికోసం నేనెక్కడ పోలీసు స్టేషన్లకు తిరగను అప్రతిష్ట" అంది ఆ అమ్మాయి. ఇప్పటికీ వాడు అప్పుడప్పుడూ ఫోను చేసి ఆవిడ వచ్చిందా? అని అడుగుతూనే వుంటాడు" అంది ఆ బామ్మ.

అందరూ ఆశ్చర్యంగా విన్నారు ఆ కథంతా. బస్సు హైదరాబాద్ చేరింది. బామ్మగారి బోధనలు సంతృప్తి పడ్డ ప్రయాణికులు ఆమెకు ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయారు.

Post your comments